# జీవనగమనాలు

ఎన్నెస్. కలందర్

గన్నేరు చెట్టు మీది సీతాకోక చిలుకతో తన కొడుకుని పోల్చుకుని చూసుకుంది పార్వతమ్మ. తను ఒంటరిగా బతకవలసివస్తుందనీ పార్వతమ్మ కలలోకూడా వూహించలేదు. కానీ, ఆమె ఒంటరిగా బతకవలసివచ్చింది.

గన్నేరు చెట్టు ఆకు మీద మెరుస్తూ కనిపించే గుడ్డు పగిలి, అందులోంచి సీతాకోక చిలుక బయటపడి, కొద్ది క్షణాల దాకా కదలకుండా మెదలకుండా అలాగే వుండిపోయింది. సీతాకోకచిలుక ఇంకా తడారని తన రంగుల రెక్కల్ని విప్పి, ఒక్కసారిగా గాల్లోకి లేచింది. అది తన బరువైన రెక్కల్ని మోయలేక, అదే కొమ్మమీది పువ్వు మీద వాలింది.

అది దాని జీవనపోరాటంలో తొలిమెట్టని అనుకుంది. ఇందాకట్నుంచీ దాన్నే చూస్తున్న పార్వతమ్మ. చెట్టుకు నీళ్లుపోస్తుండగా, యాదృచ్ఛికంగా ఆమెకాదృశ్యం కనిపించింది. ఆమె వింతగా ఆ సీతాకోకచిలుకనే చూస్తుండిపోయింది చాలా సేపటివరకు.

సీతాకోక చిలుకని చూస్తుంటే, ఆమెకు తన కొడుకు రవి గుర్తుకురాసాగాడు. ఆ మహాపట్నంలో, ఆ భార్యతో ఎన్ని కష్టాలననుభవిస్తున్నాడో బిడ్డ, అనుకుంది పార్వతమ్మ.

పార్వతమ్మకు తోడుగా నీడగా ఆ ఇంట్లో మిగిలింది ఆ ఒక్క గన్నేరు చెట్టే! ఆమె కొడుకు రవికి ఎన్నేళ్లుంటాయో, అన్నేళ్లుంటాయా చెట్టుకు.

--చెట్టుమీది సీతాకోకచిలుక పార్వతమ్మ చూస్తుండగానే, గాల్లోకిలేచి, ఎటో ఎగిరిపోయింది.

పార్వతమ్మ భర్తపోయి అప్పటికే ఐదేళ్లు కావస్తోంది. ఆమె జీవనాధారం పెన్షన్. పార్వతమ్మ భర్త సెంకెండరీగ్రేడ్ టీచర్. తనకొచ్చే జీతంలోనే కొడుకుని చదివించాడు. కూతురిపెళ్లికూడా చేసేశాడు. తన బాధ్యతలు పూర్తయిపోయినట్లు ఆయన, తన యాభైరెండేళ్ల వయసులోనే పరలోకానికి వెళ్లిపోయాడు.

రవికి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కంపెనీలో మంచి



వుద్యోగమే వచ్చింది. పార్వతమ్మ కొడుకు పెళ్లి ఘనంగా చేసింది. తల్లిని ఒంటరిగా వదిలివెళ్లడం రవికి ఇష్టంలేదు. తన వెంట హైదరాబాద్ వచ్చేయమన్నాడు తల్లితో. ఏదో మొక్కుబడిలా అత్తనలా పిలవడం పార్వతమ్మకు నచ్చలేదు. ఆమె హైదరాబాద్ వెళ్లకుండా, అదే వూళ్లో వుండిపోవడానికి నిర్ణయించుకుంది.

"నేనెంతైనా మీ అమ్మకు పరాయిదాన్నేలెండి. అత్తయ్యకు శాంతంటేనే ప్రేమ ఎక్కువ. కూతుర్ని చూడకుండా అత్తయ్య వుండలేరు. అందుకే రానంటున్నారు" అని కోడలు కొడుకుతో అంటూవుంటే, కొడుకు మౌనంగా వుండిపోవడం పార్వతమ్మకు నచ్చలేదు. ఆమెకు ఆత్మాభిమానం ఎక్కువ. చిన్నచిన్న సమస్యల్ని నాజూగ్గా పరిష్కరించుకునే లౌక్యంలేనివాడు రవి. అందువల్లే అతను తల్లి మనస్సులో అసమర్థుడిలా మిగిలాడు. పార్వతమ్మకు ఒంటరిగా బతుకుతున్నాననే బెంగలేదు. ఒంటరి బతుకులో ఆమెకు స్వేచ్ఛవుందీ, ఆనందమూ వుంది. అయినా, ఆమె మనసు మూలలో కొడుకు గురించి బెంగవుంది.

పార్వతమ్మ ఇంటిగొడవలు పార్వతమ్మకు సంబంధించినవే అయినా, బంధువులూ, చుట్టుపక్కల వాళ్లు వూరుకుండేవారు కారు. మనదేశంలోని సమస్యలపట్ల అమెరికా సానుభూతి ఎలావుంటుందో అలా వుండేదీ వాళ్ల చూపే సానుభూతి-- "కొడుకు హైదరాబాదులో వుద్యోగం చేస్తుండగా, ఇక్కడ నువ్విలా ఒంటరిగా వుండడమేమీ బాగోలేదు. నీ కొడుకు నిన్నెందుకు పిల్చుకెళ్లడూ?" "ఇలా ఎంతకాలమనీ, నీకేమైన జబ్బుపడితేనో...." ఇలా మరికొందరి సానుభూతి మరింత సాగేది. ఎవరికి చెప్పాల్సిన జవాబు వాళ్లకు చెప్పేది పార్వతమ్మ.

పార్వతమ్మ మనస్సులో ఓసారి హైదరాబాద్ చూసిరావాలనీ చాలాకాలంగా ఓ కోరికవుంది. కొడుకు, కోడలు వూరికొచ్చినప్పుడు ఎవరో ఒకరు కాస్త బలవంతపెట్టివుంటే చాలు, ఆమె హైదరాబాద్‌కువెళ్లి, చూసివచ్చేది. కానీ, అలా జరగలేదు. పార్వతమ్మ కోరిక, కోరికగానే మనసులో వుండిపోయింది.

వూర్లోనే కూతురున్నా, వాళ్లింటికి ఎక్కువసార్లు వెళ్లేదికాదు పార్వతమ్మ. నిజమైన ప్రేమ, నిజాయితీ ఆప్యాయతలు ఆమెకు కొరవడ్డాయి. కూతురి నిష్టూరపు మాటలకు, పార్వతమ్మ ఎంతో సెంటిమెంట్‌గా దాచుకున్న బంగారు గొలుసుతోకూడిన తాళిని కరిగించివేసి, ఆమెకు గాజులు చేయించి ఇచ్చింది. గాజుల్ని చూసి మురిసిపోతూ, "మా అమ్మ పిసినారనీ మీరు ఎగతాళి చేసేవారు. చూశారా, నేనంటే మా అమ్మకెంత ప్రేమో! మా అమ్మ మంచిది..." అంది, భర్తతో శాంతి. ఆ మాటలెంతో నాసిరకంగా అనిపించాయి పార్వతమ్మకు. ఆ మాటలు ఆమె మనసులో చెప్పలేనంత అలజడిని రేపాయి.

* * *

పార్వతమ్మ మధ్యాహ్నంకోసం వంటపని పూర్తిచేసేసుకుని, వక్కపొడి నములుతూ, చందమామ తీసుకుని చదువుకుంటూ కూర్చుంది. పార్వతమ్మ అసలేమీ చదువుకోలేదు. భర్త నేర్పిన అక్షరాలే ఆమెకు చదువును నేర్పాయి. ముప్పయి రోజుల్లో ఆమె పెద్దబాలశిక్షను పూర్తిచేసి, అందులోని పాఠాలన్నింటినీ నేర్చుకుంది.

"అమ్మమ్మా!" అంటూ వచ్చి వాలాడు పార్వతమ్మ మనవడు.

"రావోయ్, రా" అంటూ తన పక్కలో మనవడ్ని కూర్చోబెట్టుకుంది పార్వతమ్మ.

"అమ్మమ్మా, నీకు చదవడం కూడా వచ్చా!" అంటూ ఆశ్చర్యపోయాడు మనవడు.

పార్వతమ్మ నవ్వి, "అంతం పదంలో ఎన్నక్షరాలున్నాయిరా" అంటూ అడిగింది.

"ఆఁ ఎన్నీ...., నాలుగూ" అన్నాడు మనవడు.

"తెలుగు పండితుడా, అంకెల్లో సున్నా చేర్చితే దాని విలువ పెరుగుతుంది. అదే, అక్షరం పక్కలో దాన్ని చేర్చితే అది నాంతో కలిసిపోతుంది. 'అంతం' అంటే రెండక్షరాలే" అంటూ తేలిగ్గా చెప్పేసింది పార్వతమ్మ.

తెల్లమొహమేసేశాడు మనవడు. మనవడి అహం దెబ్బ తింది. "తెలుగయితే మన భాష. అది నేర్చుకోవడమేమీ కష్టంకాదు. మరి, ఇంగ్లీషు పరాయిభాషే! దాన్ని నేర్చుకోవడం ఎంత కష్టమనుకున్నావ్!? నాకు ఇంగ్లీషు బాగావచ్చు" అని తన వాదాన్ని బలపర్చుకోజూశాడు మనవడు.

"ఆ వెధవ ఇంగ్లీపీసు. అది, సంస్కృతంకంటే కష్టమట్రా! నువ్వు కాన్మెంట్‌లో చదివావు, నీకు ఇంగ్లీషు కూడా రాకుంటే ఎలా?"

"అయ్యో, కాన్మెంట్ కాదు అమ్మమ్మ. కాన్వెంట్, కాన్వెంట్" ఆ పదాన్ని సరిచేశాడు మనవడు.

"ఆ అంతా ఒకటే గోల! నాకు ఎ.బి.సీ.డీ.లు కూడా బాగావచ్చు"

"ఎ.బి.సి.డి.లు రాగానే ఇంగ్లీషురాదు."

"ఆ ఇంట్లో ఏదో పుస్తకముండాలి. దాన్ని చదివితే, ముప్పయిరోజుల్లో ఇంగ్లీషు నేర్చుకోవచ్చుట గదరా! చూడూ, నువ్వు బాగా చదువుకునీ, స్కూల్ ఫస్ట్‌రా"

ఇబ్బందిగా మొహంపెట్టాడు మనవడు. "ఇక్కడికొస్తే ఇదే నీ వస. వచ్చే ఆదివారం నేనిక్కడికి రాను"

"ఒరే వాసూ, పెద్దలు చెప్పేదంతా మీ మంచికేరా మంచి మార్గం ఎంచుకుంటే, అదే నడవడం నేర్పుతుందిరా" అంటూ హితోపదేశం చేసింది పార్వతమ్మ.

"ఇక నేనెళ్లివస్తాను. నువ్వు ఇంగ్లీషు చదివీ, నాకు నేర్పించు" అని వెక్కిరింపుగా అనేసి, మనవడు అక్కడినుంచి జారుకున్నాడు.

"మీ నాన్నకు రెండువేలిచ్చాము టి.వీ.కోసం. ఆ విషయం గుర్తుచేయి నాయనా" వెళుతున్న వాసుతో గట్టిగా అంది పార్వతమ్మ.

పార్వతమ్మ ఇంగ్లీషుపుస్తకం (తెలుగు టు ఇంగ్లీషు) ముందేసుకుని, తీరికవేళల్లో చదువుకోసాగింది.

ఒకవారం గడిచింది. పార్వతమ్మ మనవడికోసం ఎదురుచూసింది. కానీ మనవడు రాలేదు. రెండవవారం ఆదివారం రోజున మనవడు వచ్చాడు. మనవడ్ని చూడగానే పార్వతమ్మ సంతోషపడిపోయింది. "హలో మైడియర్ బోయ్, కమ్ హియర్" అంది.

పార్వతమ్మ నోటినుంచి ఆ మాటలు రాగానే మనవడు ఆశ్చర్యపోయాడు. "అమ్మమ్మా నీది ఒట్టి బుర్ర కాదు, కంప్యూటర్" అంటూ గట్టిగా అరిచాడు.

పార్వతమ్మ ముసిముసిగా నవ్వుకుంది

"అమ్మమ్మా, నిన్న వారం నేను రాలేదు. నాకు ఒంట్లో జ్వరంగావుంటే, అమ్మ వెళ్లొద్దులేరా అంది..." సంజాయిషీ చెప్పుకోసాగాడు మనవడు.